న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వరస్వామికి ఘనంగా క్షీరాభిషేకం


పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహ స్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసచార్యులు మంత్రోచ్చారణలతో ఈ ప్రక్రియ చేపట్టారు. భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వయోపరిమితి సడలించండి

జగిత్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన నిరుద్యోగులు, విద్యార్థులు అందరూ టీఎస్‌పీఎస్సీ చేపట్టిన పోటీ పరీక్షలకు హాజరయ్యేలా వయోపరిమితి సడలించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. స్థానిక ఇందిరా భవన్‌లో నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్సీని కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకే వయోపరిమితిలో సడలింపు ఇవ్వడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో స్నేహభావం

రాయికల్(జగిత్యాల): క్రీడలతో మనసిక ఉల్లాసం కలుగడంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కొత్తపేటలో క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి, క్రీడాకారులు చింతలపల్లి రాజ్‌కుమార్, కల్లెం శ్రీనివాస్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

జగిత్యాల: టైలరింగ్, మగ్గం వర్క్స్‌పై మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని మైనారిటీ జిల్లా అధికారి సాయిబాబా శుక్రవారం తెలిపారు. ఇందుకోసం కోరుట్ల పట్టణ, డివిజన్‌లోని యువత కోసం స్టార్ మహిళా శిక్షణ కేంద్రం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు.. స్టార్ మహిళా శిక్షణ కేంద్రం, మొబైల్ నంబరు 91772 58068లో సంప్రదించండి.

కోరుట్ల బస్టాండ్‌లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న డీఎం లక్ష్మీప్రసూన

కోరుట్లరూరల్: స్థానిక బస్టాండ్‌లోని దుకాణాల్లో ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా వినియోగించడం, ఇతర వస్తుసామగ్రి విక్రయించడం, ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేసే దుకాణ యజమానులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ వెంకటేశం, కంట్రోలర్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష కేంద్రాల్లో సకల సౌకర్యాలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాల: త్వరలో చేపట్టే కంటి వెలుగు పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమానికి అవసరమైన వస్తు, సామగ్రిని ఇప్పటికే అన్ని పరీక్ష కేంద్రాలకు సరిపడా పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి స్వామి, కో ఆర్డినేటర్ తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ.400.13కోట్లు మంజూరు చేస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2022–23 సంవత్సరానికి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 427 పనులకు ఈ నిధులు వెచ్చించినట్లు పేర్కొంది. చొప్పదండి నియోజకవర్గంలో 118 పనులకు రూ.11.65 కోట్లు, ధర్మపురిలో 5 పనులకు రూ.50 లక్షలు, జగిత్యాలలో 123 పనులకు రూ.11.10 కోట్లు, కోరుట్లలో 149 పనులకు రూ.13.90 కోట్లు, వేములవాడ నియోజకవర్గంలో 32 పనులకు రూ.2.98 కోట్లు మంజూరైనట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది.


సకినాలు కాలుస్తున్న లక్ష్మి





- పండుగకు పిండివంటలతో ఉపాధి
- హోంఫుడ్స్‌కు ఖండాంతరాల్లో డిమాండ్
- చిన్నాపెద్ద కార్యక్రమాలకు భారీగా ఆర్డర్లు
- ఇండ్లలో సహజసిద్ధంగా పిండివంటల తయారీ
- ఉమ్మడి జిల్లాలోని మహిళల స్వయంకృషి

సంక్రాంతి స్పెషల్

విలేజ్ నుంచి విదేశాలకు..

నోరూరిస్తున్న సంక్రాంతి ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే పిండి వంటలు. వారం రోజుల ముందు నుంచే ఇళ్లంతా ఘుమఘుమలు. సకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు ఇలా తీరొక్క రకాలు నోరూరిస్తుంటాయి. చుట్టుపక్కల వారంతా కలిసి ఆడుతూ.. పాడుతూ ఒకరికొకరు సాయంగా ఉంటూ గతంలో పిండి వంటలు చేసుకునేవారు. ఎక్కడో దూరంగా ఉంటున్న ఆత్మీయులకు పంపించేవారు. ఉరుకులు, పరుగుల జీవితంలో పెద్దమొత్తంలో పిండివంటలు ఇప్పుడు సాధ్యం కావడం లేదు. దీంతో చాలా మంది హోంఫుడ్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన ఇంటివంటలు గ్రామాల్లోనూ విశేష ఆదరణ పొందుతున్నాయి. క్వాంటిటీ, క్వాలిటీయే లక్ష్యంగా తయారు చేసిన వంటకాలను దేశవిదేశాల్లోని మన తెలంగాణవాసులు ఎంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు. పండుగ సమయంలోనే కాదు.. ఏడాది మొత్తం గిరాకీ ఉంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని పలు హోం ఫుడ్స్, మహిళలకు లభిస్తున్న ఉపాధిపై సంక్రాంతి సందర్భంగా కథనం..

ఆర్డర్లపై తయారీ..

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలోని గణేశ్‌నగర్‌కాలనీకి చెందిన తాడిశెట్టి పద్మ సర్వపిండి సెంటర్ నిర్వహిస్తోంది. పండుగలు, శుభకార్యాలకు ఆర్డర్లపై సకినాలు, మడుగులు, ఖార్జా, బాదుషా తదితర పిండి వంటకాలు చేసి అందిస్తోంది. 10 సంవత్సరాలుగా పిండి వంటలు చేస్తూ మరో ఇద్దరికి పని కల్పిస్తోంది. పండుగ వేళల్లో ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉద్యోగంలో ఉన్నవారికి పంపిస్తున్నారు. స్వీట్లు కేజీ రూ.300, పిండి వంటలు కేజీ రూ.250 చొప్పున అందిస్తున్నామని పద్మ పేర్కొంటోంది.


పిండి వంటలు చేస్తున్న పద్మ

సంక్రాంతికి ఆర్డర్లు ఫుల్

సంక్రాంతి వచ్చిందంటే మాకు చేతినిండా పని ఉంటుంది. ఖాళీగా ఉండకుండా ఇంటిపట్టున ఉంటూ ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఆర్డర్ మీద అప్పాలు చేయాలన్న ఆలోచన వచ్చింది. ప్రత్యేకంగా బ్రాండ్ లేకుండానే తెలిసిన వారి నుంచి ఆర్డర్లు తీసుకుని క్వాలిటీతో సమయానికి ఇవ్వడంతో రోజురోజుకూ గిరాకీ పెరిగింది. అప్పాలు చేయడంతో వచ్చిన పైసలతోనే మా ఇద్దరు అమ్మాయిలను అమెరికా పంపించా.

– తానిపత్తి లక్ష్మి, గ్రూప్ లీడర్, సుల్తానాపూర్

అప్పాల 'సుల్తానాపూర్'



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో ఏడాదంతా అప్పాల ఘుమఘుమలు వస్తూనే ఉంటాయి. 15ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన లక్ష్మి లీడర్‌గా పదిమంది సభ్యులతో గ్రూపుగా ఏర్పాటయ్యారు. చిన్నమొత్తాలతో వ్యాపారం చేయాలనుకున్నారు. గ్రూప్‌లోని ఓ సభ్యురాలి ఇంట్లో వివాహ వేడుకకు పెద్దమొత్తంలో పిండివంటలు తయారు చేయాల్సి వచ్చింది. కావాల్సిన సారెను అందరూ కలిసి సిద్ధం చేశారు. తరువాత పిండివంటల తయారీ తెలిసిన పని, తక్కువ పెట్టుబడి కావడంతో వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నారు. అలా ప్రారంభమై ఇప్పుడు ఏటా రూ.60 లక్షల టర్నోవర్ అవుతోంది. అప్పులు తీర్చుతూ, తమ పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు. మరో 50మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ బిజినెస్ బాగుండటంతో ఇదే వృత్తిగా ఆ గ్రామంలో ఏడు గ్రూప్‌లు ఏర్పడ్డాయి. వీటికింద సుమారు 400మందికి పైగా సహాయకులు ఉపాధి పొందుతున్నారు. 32 వరుసలతో చక్రాల సకినాలు, కిలో పరిమాణంలో లడ్డూ, కరిజ, బెల్లం అరిసెలు, నువ్వుల లడ్డూ, మురుకులు, చెగోడీలూ, గవ్వలు, ఖారా, ఇతరత్రా వంటకా లను పెద్ద ఎత్తున తయారు చేయడం వీరి ప్రత్యేకత. వీరి అప్పాలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలతోపాటు, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలాంటి దేశాలకు ఆర్డర్‌పై వెళ్తుంటాయి. దీంతో సుల్తానాపూ ర్ ఇప్పుడు అప్పాలపూర్‌గా మారింది.

పిండి వంటలకు కేరాఫ్ గూడూరు


సకినాలు చేస్తున్న మహిళలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడూరు తెలంగాణ పిండివంటలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామానికి చెందిన చీటి వసంత విదేశాల్లో ఉండే బంధువుల కోసం ఐదేళ్ల క్రితం సకినాలు, గారెలు, రవ్వలడ్డూ, సర్వపిండి, నువ్వుల లడ్డూ తయారుచేసి పంపించారు. అవి వారికి నచ్చడంతో తరుచూ తయారు చేయమని కోరారు. దీంతో చీటి వసంత, కారంగుల రజనీ మరో ఇరవై మందికి ఉపాధి కల్పిస్తూ ఐదేళ్లుగా తెలంగాణ పిండి వంటలు తయారు చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు. హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, ముంబయి నుంచి కూడా ఏడాదిపొడవునా ఆర్డర్లు వస్తున్నాయి. ఇవేకాకుండా చికెన్, మటన్, ఫిష్ పచ్చళ్లు అందిస్తున్నారు. సకినాలు, గారెలు, లడ్డూ కిలోకు రూ.300 చొప్పున అందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నెలరోజుల నుంచే ఆర్డర్లు పంపించామని చెబుతున్నారు.

సంప్రదాయ వంటలు



ఇంట్లో ఖాళీగా ఉండలేక బంధువుల కోసం సకినాలు, గారెలు అందించా. రుచి నచ్చి చాలామంది పిండి వంటకాలు కావాలని అడిగారు. అలా ఐదేళ్ల క్రితం మొదలైన పిండి వంటల తయారీ నిత్యం కొనసాగుతోంది. సకినాలు, సర్వపిండి, గారెలు, లడ్డూలు, అరిసెలు తయారు చేసి ఇస్తున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.

– చీటి వసంత, గూడూరు

సర్కారు సాయం చేయాలి



సహజసిద్ధంగా లభించే పిండిపదార్థాలతో వంటకాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం సాయం అందిస్తే పిండివంటకాల అవుట్‌లెట్లు పెడతాం. మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. సంక్రాంతి పండగే కాదు సంవత్సరమంతా సకినాలు, గారెలు, సర్వపిండి, చెగొడీలకు గిరాకీ ఉంటుంది. నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నాం.

– కారంగుల రజని, గూడూరు

19 ఏళ్లుగా ఇంటి వంటలు


గారెలు తయారు చేస్తున్న మహిళలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని పవర్‌హౌజ్‌కాలనీలోని శ్రీసాయి తెలంగాణ పిండివంటల టేస్టే సపరేటు అంటున్నారు స్థానికులు. తానిపర్తి రామ్మోహన్‌రావు ఆయన భార్య జయశ్రీ కలిసి పండివంటల కేంద్రాన్ని వారి ఇంట్లోనే నిర్వహిస్తూ 20మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. చకినాలు, గారెలు, అరిసెలు, చగోడిలు, నువ్వుల ముద్దలు, లడ్డులు, కారపూసలు(జంతికలు), కరిజలు, పల్లీలడ్డులు, బక్షాలు, సర్వపిండి తయారు చేస్తున్నారు. వీటిని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, సూపర్ మార్కెట్‌లు, కిరాణం దుకాణాలతోపాటు హైదరాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, యుకే తదితర దేశాలకు ఎన్ఆర్ఐ ప్యాకింగ్‌లో తెలుగువాళ్లకు కూడా పంపిస్తున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.

పప్పు, జొన్నరొట్టెతో ప్రారంభించాం..



2003లో పప్పు, జొన్న రొట్టెతో ప్రారంభించాం. 19 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేస్తున్నాం. మాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయి. విదేశాలకు కూడా మేం తయారు చేసిన పిండి వంటలను తీసుకుపోతుండడం ఆనందంగా ఉంది. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే ఆర్డర్లు రెడీ చేశాం.

– తానిపర్తి రామ్మోహన్‌రావు, జయశ్రీ

'మంథని' రుచులు

మంథని: మంథనికి చెందిన పలువురు మహిళలు స్వయం ఉపాధి కోసం పిండి వంటలు తయారు చేస్తున్నారు. వీటిని విదేశాల్లోని తమవారికి పంపిస్తుంటారు. సంక్రాంతి పండగ పిండి వంటలు పదిహేను రోజుల ముందు నుంచే అమెరికా, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాతో ప్రపంచంలోని ఆయా దేశాలకు చేరాయి. మంథనిలో కారపు చకినాలు ప్రత్యేకం. పచ్చి మిరపకాయల ముద్ద, కోతిమీర, నెయ్యి, వెన్నతో తయారు చేసే కారపు చకినాలకు మంచి గిరాకీ ఉంటుంది. వీటిని చాలామంది కొనుగోలు చేసుకెళ్తుంటారు. మోతీచూర లడ్డూ కూడా ఇక్కడ స్పెషల్. ఏ రకం పిండి వంటలైనా కిలో రూ.300 నుంచి రూ.400కు విక్రయిస్తుంటారు. 'మేము తయారు చేసిన పిండివంటలు కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నాం. తయారీ ఖర్చు రూ.250 వరకు ఉంటుంది. కిలోకు యాభై రూపాయలు మిగులుతాయి. పండగ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మిగతా రోజుల్లో తక్కువే. విదేశాలకు పంపేవారు ముందుగానే ఆర్డర్ ఇస్తారు.' అని వాణి లక్ష్మీ నారాయణ స్వగృహఫుడ్స్ నిర్వాహకురాలు బండారి సునీత వివరించారు.


తయారు చేసిన పిండి వంటలతో బండారి సునీత

భోగి.. వైభోగం

- సంబరాలకు ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం
- రంగవళ్లులు.. డూడూ బసవన్నలు ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్/ బోయినపల్లి (చొప్పదండి): మూడురోజుల ముచ్చటైన వేడుక సంక్రాంతి సంబరాలకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. నేటి భోగితో ప్రారంభమయ్యే పండుగ జోష్ కనుమ వేడుకతో ముగియనుంది. భోగి మంటలు వేసి ఆడిపాడేందుకు యువత, చిన్నారులు రెడీ అవుతున్నారు. ఇంటివాకిళ్లు రంగవళ్లులతో ముస్తాబుకానున్నాయి. తాటాకులతో భోగి మంట వేస్తారు. ఆ మంటల్లో ముందుగా సిద్ధం చేసుకున్న పాత వస్తువులు వేస్తారు. మంటల మధ్యన నీటితో నింపిన కుండలను పెడతారు. ఆ మంటలకు కాగిన వేడినీటితో భోగి స్నానాలు చేస్తారు. భోగి మంటల్లో పాత వస్తువుల వేయడం వల్ల పీడతొలగి భాగ్యాల్ని అందిస్తుందని విశ్వాసం. భోగి రోజు పిల్లలకు రేగుపండ్లు తలపై పోస్తారు. సాయంత్రం చుట్టుపక్కల పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా రేగుపండ్లు, చిల్లరనాణేలు, బంతిపూల రెక్కలు, చెరకు ముక్కలు పిడికిలో తీసుకుని పిల్లలకు మూడుస్లారు దిష్టితీస్తారు. సంక్రాంతికి పంటలు చేతికందిన రైతులు రెండోపంట వేసుకునేందుకు తమ పొలాల్లో కొంత మేరకు నీరు పారించి భూమిని తడుపుతారు. దీన్ని పిలకవేయడం అంటారు. భోగి సందర్భంగా మహిళలు ఇంటిముంగిళ్లను రంగవల్లికలతో స్వరాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు ముగ్గుమధ్యలో పెడతారు. ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. శ్రీరంగనాథుడిని గోదాదేవి వివాహం చేసుకున్నది భోగిరోజు కావున.. వైష్ణవ ఆలయాల్లో భోగిరోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ముత్తయిదువులను పేరంటానికి పిలిచి సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సంక్రాంతిని మూడురోజులు పాటు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధం అవుతున్నారు.



- లింక్ కాలువ పనులు పూర్తయి ఏడాది
- ఇంకా ప్రారంభానికి నోచుకోని వైనం

స్థిరీకరణ సంకల్పానికి గండి

మల్యాల(చొప్పదండి): లింక్ కెనాల్ ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి గండి పడుతోంది. పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా నేటికీ లింక్ కాలువ ప్రారంభించకపోవడంతో సర్కారు లక్ష్యంగా నీరుగారిపోతోంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కాలువ వరదమట్టితో కూరుకుపోతోంది. బిగించిన మోటార్లు తుప్పు పట్టే స్థితికి చేరుతున్నాయి.

3.2కి.మీ. దూరంలో..

మల్యాల మండలం తాటిపల్లిశివారులోని గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామ సరిహద్దుల్లో వరద కాలువ ఉంది. అక్కడినుంచి 3.275 కి.మీ. దూరంలోని తాటిపల్లి శివారు ఎస్సారెస్పీ కాలువకు అనుసంధానించేందుకు సుమారు రెండున్నరేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. వరదకాలువ 88.74 కి.మీ. – ఎస్సారెస్పీ కాలువ 97వ కి.మీ. మధ్య లింక్ కెనాల్ నిర్మించారు. ఇందుకోసం తాటిపల్లి రైతుల నుంచి 75 ఎకరాలు సేకరించారు. తొలుత శరవేగంగా కొనసాగిన పనులు.. నిధులు మంజూరు కాలేదంటూ ఏడాదిపాటు నిలిపివేశారు. ఆ తర్వాత పనులు పునఃప్రారంభించి శరవేగంగా కొనసాగించారు. దీంతో ఏడాది క్రితం పనులు నూరుశాతం పూర్తిచేశారు. కాలువను ప్రారంభానికి సిద్ధం చేశారు.

స్థిరీకరణ కోసం ఎదురుచూపు..

ఎస్సారెస్పీలో నీరు లేకున్నా.. వరదకాలువ ద్వారా లింక్ కెనాల్‌తో ఎస్సారెస్పీ డీ–70 నుంచి డీ–94 వరకు సుమారు 2.51లక్షల ఆయకట్టు స్థిరీకరించాలనేది సర్కారు లక్ష్యం. అయితే, అధికారుల నిర్లక్ష్యంతో పనులు పూర్తయినా లింక్ కెనాల్ ఇంకా ప్రారంభించలేదు. దీంతో రైతులు ఏడాదిగా నిరీక్షిస్తున్నారు. ఎల్లంపల్లి ద్వారా వచ్చే వరదనీటిని ర్యాలపల్లి శివారు నుంచి లింక్ కెనాల్ ద్వారా మళ్లిస్తే ఎస్సారెస్పీ ఆయకట్టుకు త్వరితగతిన సాగునీరు అందుతుంది. ఎస్సారెస్పీ ఆయకట్టులో ఐదో వంతుకుపైగా మూడు వేల క్యూసెక్కులతో సుమారు 2.51లక్షల ఎకరాలకు లింక్ కెనాల్ ద్వారా సాగునీరు అందుతుంది. కాలువలో ఏడాది పొడవునా సుమారు 4మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది మరింత సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రధానంగా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్ వరకు ఏడాది పొడవునా వరదకాలువలో నీరు నిల్వ చేస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగి, సాగు పెరిగింది. వరదకాలువ ఎగువ ప్రాంతాలకు నీరందించేందుకు ఎత్తిపోతల ప్రతిపాదనలతో చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతీచెరువును తూముల ద్వారా నింపుతున్నారు. నీరందని చెరువులను ఎత్తిపోతలు, తూముల ద్వారా నింపేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టారు.


వరదకాలువ- ఎస్సారెస్పీ కెనాల్ మధ్య నిర్మించిన లింక్ కెనాల్

యాసంగికే నీరందించాలి



లింక్ కెనాల్ పూర్తయి ఏడాది గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో మోటార్లు తుప్పు పట్టే పరిస్థితి నెలకొంది. వరదలకు మట్టి కొట్టుకువచ్చి, కాలువలో పేరుకుపోతోంది. ఈ యాసంగికే నీరు అందించేలా చర్యలు ప్రారంభించాలి.

– సిరికొండ మహేందర్, రైతు

పనులు పూర్తిచేశాం

ఎస్సారెస్పీ – వరదకాలువ లింక్ కెనాల్ 3.275 కి.మీ. వరకు చేపట్టిన పనులు ఏడాదిక్రితం పూర్తయ్యాయి. కెనాల్‌ను ప్రారంభించడమే మిగిలింది. త్వరలో ప్రారంభించి, ఈ యాసంగికే సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– సుధాకిరణ్, ఈఈ

సంఘటితంగా ఉంటేనే బలోపేతం


మాట్లాడుతున్న పాక మురళి

జగిత్యాలటౌన్: హిందువులు సంఘటితంగా ఉంటేనే హిందూ సమాజం మరింత బలోపేతం అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ పాక మురళి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జగిత్యాల నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ముందస్తు సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘచాలక్ జిడిగె పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా మురళి పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు హైందవ సమాజం మరింతగా జాగృతం కావాలని ఆయన కోరారు. రైతులు పాడి పంటలను పూజిస్తూ కొత్తక్రాంతి కోసం ముందుకు సాగే సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి సంకోజి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరికి మొక్కులు



ధర్మపురి: గోదావరి నదిలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది తరలివచ్చి గోదావరిలో స్నానాలు ఆచరించారు.

మాస్టర్‌ప్లాన్ రద్దు చేయండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

జగిత్యాలరూరల్: బల్దియాలో మాస్టర్‌ప్లాన్ అమలును రద్దు చేయాలని కోరుతూ హస్నాబాద్ గ్రామస్తులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించడమే ధ్యేయం



మాట్లాడుతున్న రెంటెం జగదీశ్

రాయికల్(జగిత్యాల): బీఆర్‌ఎస్‌ను గద్దె దించడమే తమ ధ్యేయమని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ అన్నారు. శుక్రవారం అల్లీపూర్ గ్రామంలో కర్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జగిత్యాల: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేసే బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కేజీబీవీ బోధనేతర సిబ్బంది కార్మిక సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ రవిని కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన బోధనేతర కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు లస్మక్క, సలహాదారులు అక్షిత చౌదరి, కళావతి, స్వరూప, పుష్పలత, రాజవ్వ, సఫియా, అనుమవ్వ, నవిత, రేవతి పాల్గొన్నారు.

పండక్కి ఊరెళ్తున్నారా... జరజాగ్రత్త

- ఇంటి తాళాలు పగులగొట్టి చోరీచేసే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- ఎటైనా వెళితే సమాచారం ఇవ్వాలని సూచన



చిందరవందరగా పడిన సామగ్రి(ఫైల్)

జగిత్యాలక్రైం: సంక్రాంతి పండగ సందర్భంగా సెలవులు రావడంతో సొంత గ్రామాలకు, విహారయాత్రలకు వెళ్లేందుకు ఇప్పటికే చాలామంది ప్రయాణం మొదలుపెట్టారు. మరికొంత మంది ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇలాంటి సమయంలో పట్టణాలు, మండలకేంద్రాల్లో చోరీలు నియంత్రించడానికి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిదంటున్నారు పోలీసులు. ఇంటికి తాళం వేసి వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు, చుట్టుపక్కల వారికి ఇంటిని ఓ కంట కనిపెట్టమని సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో ఆ ఇంటి పరిసరాల్లో నిఘా పెంచుతామని, రాత్రిళ్లు పెట్రోలింగ్ చేస్తామని దీంతో దొంగలను కట్టడి చేయవచ్చని చోరీల నియంత్రణకు పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- బందోబస్తుగా ఉండే తాళాలు వాడాలి.
- రాత్రిళ్లు ఇంటి ముందు వరండాలో లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఊరికి వెళ్లే వారు బైక్‌లకు వీల్‌లాక్ ఏర్పాటు చేసుకోవాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మీ సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకోవాలి.
- ఎప్పుడు ఊరికి వెళ్తున్నారు. తిరిగి ఎప్పుడు వస్తారు వంటి వివరాలు, చిరునామా, ఫోన్‌నంబర్, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇస్తే ఆయా ప్రాంతాల్లో గస్తీ మరింత పెంచే అవకాశం ఉంటుంది.
- అపార్ట్‌మెంట్ వాసులు వాచ్‌మెన్లను ఖచ్చితంగా విధులు నిర్వర్తించాలని, కొత్త వ్యక్తులు వస్తే పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించాలన్నారు.
- అర్ధరాత్రి నుంచి వేకువ జామున 4 గంటల ప్రాంతంలో చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండడంతో ఆ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాచ్‌మెన్లకు సూచించాలి.

2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు
జరిగిన దొంగతనాలు : 82
రాత్రి జరిగినవి : 60
పట్టపగలు జరిగినవి : 22
పోలీసులు రికవరి చేసిన
బంగారం : 61.3 తులాలు
రికవరి చేసిన వెండి : 40.6 తులాలు
2023 జనవరిలో ఇప్పటి వరకు :
3 దొంగతనాలు

విలువైన వస్తువులు దాచుకోండిలా...

ప్రజలు బయటకు వెళ్తున్నప్పుడు ఇళ్లకు తాళాలు వేసే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు పెట్టొద్దు. నగదు ఉంటే తీసుకెళ్తున్న ప్రజలు బంగారం మాత్రం తీసుకెళ్లడం లేదు. దీంతో చోరీలు జరిగిన సమయంలోనే విలువైన ఆభరణాలు పోగొట్టుకుంటున్నారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు తాళాలు సరిగా వేశామా లేదా అనేది ఒకటికి రెండుసార్లు చూసుకోవాలి. అన్ని తలుపులు మూసి ఉన్నాయా లేదా చూసుకోవాలి. కొంతమంది ప్రధాన ద్వారం మూసేసి లోపలి తలుపులు తెరిచి పెట్టడం, సరిగా మూయకపోవడంతో చోరీలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. పట్టణాల్లో, గ్రామాల్లో, కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్లకు గాని, 100 డయల్‌కు గాని ఫోన్‌చేసి సమాచారం అందించాలి.

ఊరెళ్తే సమాచారం ఇవ్వండి



పండుగ సెలవుల సందర్భంగా సొంతూర్లకు వెళ్లేవారు దగ్గర్లోని పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి దీంతో వారి ఇళ్లలో, కాలనీల్లో ఎలాంటి చోరీలు జరగకుండా గస్తీ నిర్వహిస్తాం. సమాచారం ఇస్తే రాత్రి సమయంలో వారి ఇళ్లపై నిఘాపెంచుతాం. పోలీసులతో పాటు చుట్టుపక్కల ఇళ్ల వారికి, కాలనీ పెద్దలకు సమాచారం ఇచ్చి వెళ్తే చోరీలను నియంత్రించవచ్చు.

– ప్రకాశ్, డీఎస్పీ, జగిత్యాల

మన ఊరు– మన బడిపై నిర్లక్ష్యం వద్దు

- అదనపు కలెక్టర్ మకరంద్



ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ మకరంద్

కథలాపూర్(వేములవాడ): వివిధ గ్రామాల్లో చేపట్టిన మన ఊరు– మన బడి పనుల తీరుపై అడిషనల్ కలెక్టర్ మకరంద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన ఊరు– మన బడి, కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూషణరావుపేటలో పనులను పరిశీలించారు. మోడల్ స్కూల్‌గా ఎంపిక చేసిన భూషణరావుపేటలో పనుల్లో జాప్యం జరుగుతోందని, ఇంత నిర్లక్ష్యం ఎందుకని ఏఈ శ్రీధర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు సైతం పనుల్లో నాణ్యత ఉండేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. భూషణరావుపేటలో క్రీడా ప్రాంగణం పనుల్లో పురోగతి లేకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, నిర్లక్ష్యం చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. కంటి వెలుగు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, వసతులను సమకూర్చాలని ఆదేశించారు. అన్నిశాఖలకు సంబంధించి ఎంపీడీవో జనార్దన్ నిలుచొని అడిషనల్ కలెక్టర్‌కు సమాధానమివ్వడం.. మిగతా అధికారులు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ ప్రకాశ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్దర్, ఎంపీవో గంగాధర్, ఎంఈవో ఆనందరావు, వైద్యాధికారులు సింధూజ, సురేంద్ర, రచన, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, సర్పంచ్ కూన సులోచన తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పునరుద్ధరించాలి

జగిత్యాల: పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ టీఎస్ సీపీఎస్‌ఈయూ నాయకులు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనతో క్యాలెండర్, డైరీ ఆవిష్కరింపజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. నాయకులు పవన్‌కుమార్, గంగదరి మహేశ్, సతీశ్, మహేశ్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటరమణ, బండారి సతీశ్, శంకర్, వంశీ, హరికృష్ణ, ప్రమోద్, మహేందర్ పాల్గొన్నారు.

ఫలించిన సైజింగ్ కార్మికుల పోరాటం

- ఒక్కో కార్మికుడికి రూ. 800 పెంపు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్లటౌన్: సైజింగ్ కార్మికుల ఇరవై రెండు రోజుల పోరాటం ఫలించింది. కార్మికులు చేపడుతున్న కూలీపోరుపై శుక్రవారం 'సాక్షి'లో 'పెరగని కూలీ..కడుపులు ఖాళీ' పేరుతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు, యజమానులు స్పందించారు. యజమానులు కార్మికులతో కలిసి నూతన కూలీ ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.800 చొప్పున పెంచడానికి అంగీకరించారు. రాబోయే రెండేళ్ల వరకు ఈ కూలీ ఒప్పందం అమల్లోకి వస్తుందని యజమానులు, కార్మిక నాయకులు తెలిపారు. నూతన కూలీ ఒప్పందంపై జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పొల్లాల కిషన్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



ప్రవీణ్ (ఫైల్)

వెల్గటూర్: ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఎండపల్లి మండలం పాతగూడూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతగూడూర్‌కు చెందిన ఉప్పమల్ల ప్రవీణ్ (34) మానసిక వైకల్యంతో బాధపడుతూ అప్పుడప్పుడు ఇంటినుంచి వెళ్లి రెండు మూడు రోజులకు తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈక్రమంలో బుధవారం రోజు రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు స్కూటీపై వెళ్లి తిరిగిరాలేదు. ఎప్పటి లాగే రెండు మూడు రోజుల్లో వస్తాడని అనుకున్నారు. శుక్రవారం అయినా తిరిగి రాకపోవడంతో స్థానికంగా వెతికి వారి వ్యవసాయ బావి వద్దకు వెళ్లిచూడగా బావిలో శవమై తెలియాడుతూ కనిపించాడు. మృతుడు వ్యవసాయ బావిలో మృతుడి శవం తేలియాడుతూ కనిపించింది. ఇంటి నుంచి వెళ్లిన రోజే ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఉప్పమల్ల బాల్‌రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

వైభవం.. స్వామివారి కల్యాణం

జగిత్యాల/మల్లాపూర్/ధర్మపురి/(కోరుట్ల)కోరుట్లటౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం శ్రీగోదా రంగనాయకుల కల్యాణం వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు చేశారు. భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం తంతు తిలకించి పులకించిపోయారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.



కోరుట్లలో హాజరైన భక్తులు



కోరుట్లలో చిన్నారుల నృత్యం

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలో ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

భార్యను చంపిన భర్తకు మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్: అనుమానమే పెనుభూతంగా మారి, కట్టుకున్న భార్యను కాటికి పంపిన భర్తకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాలత్రిపుర సుందరి కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరీ గ్రామానికి చెందిన దొంతుల లక్ష్మికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మూడో కూతురు మంజులను నిర్మల్ జిల్లా బోథులోని కోసగంటి శ్రీనివాస్‌కు ఇచ్చి 18 ఏళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు సంతానం. పెళ్లి అనంతరం, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని దుబ్బవాడకు వారు మకాం మార్చారు. ఇక్కడే ఉపాధి పొందుతున్నారు. అయితే, వివాహం అయిన రెండేళ్ల నుంచి భార్యపై అనుమానంతో శ్రీనివాస్ వేధించడం మొదలు పెట్టాడు. పలుమార్లు కుటుంబసభ్యులు సర్దిచెప్పడంతోపాటు పంచాయితీలు కూడా నిర్వహించారు. అయినా, శ్రీనివాస్ తీరు మారకపోగా, భార్యను ప్రతీచిన్న కారణానికి వేధించడం అధికం చేశాడు. ఈక్రమంలో 2013 జూలై 25న భార్య తన పుట్టింటికి వెళ్లివస్తానని చెప్పింది. ఇందుకు భర్త నిరాకరించాడు. ఈక్రమంలో ఆమెతో గొడవపడ్డాడు. అదేరోజు, ఇంట్లో పడుకుని ఉన్న భార్య తలపై సుత్తితో కొట్టగా తీవ్ర రక్తస్రావమై మరణించింది. ఈ విషయంపై మృతురాలి తల్లి దొంతుల లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి, నిందితుడైన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం.. శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

అటవీ భూములు చదును చేస్తున్న వాహనాలు సీజ్



అటవీ, పోలీసులు పట్టుకున్న వాహనాలు

కథలాపూర్(వేములవాడ): కలిగోట గ్రామశివారులో అటవీశాఖకు చెందిన భూములను అక్రమంగా చదును చేస్తున్న నాలుగు వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు అటవీశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం వేకువజామున కలిగోట గ్రామశివారులో పోలీస్ శాఖ సహకారంతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అటవీశాఖకు చెందిన భూమిలో జేసీబీతో చెట్లను తొలగించి మూడు ట్రాక్టర్లతో చదును చేస్తున్నట్లు కనిపించాయన్నారు. జేసీబీతోపాటు మూడు ట్రాక్టర్లను పట్టుకొని కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మెట్‌పల్లి ఎఫ్‌ఆర్వో షౌకత్ ఆలీ, కథలాపూర్ ఎస్సై రామచంద్రం, సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్ రఫీ నయూం పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): అన్నిరంగాల్లో వెనుకబడిన వంజరి కులస్తుల రిజర్వేషన్ సౌకర్యం, హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమని తెలంగాణ రావోజీ వంజరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముష్కరి తుక్కారాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోని పాలకుల అనాలోచిత నిర్ణయాలతో తమ కులస్తులు రిజర్వేషన్లు కోల్పోయారని ఆరోపించారు. మహారాష్ట్ర, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఎస్టీలుగా కొనసాగుతూ ఇక్కడ మాత్రం బీసీ – డీ జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు. తమకు తగిన న్యాయం జరగని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకైనా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. నాయకులు ముష్కరి సురేందర్, ముష్కరి రాజు, సంతోష్, రాకేశ్, రాజు, రాజలింగం, సత్యనారాయణ, శంకర్, భూమన్న, మహేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, కోనాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల 2000–2001 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి రేచపల్లికి చెందిన మిత్రుడు జట్టు మల్లేశ్ మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బండారి వెంకటేశ్, రవినాయక్, ప్రభాకర్, సురేశ్, దేవేందర్, తిరుపతి, రమేశ్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.